ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025
5
శ్రీ సత్యసాయి

జిల్లా ఓటర్లు 14,18,331

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా తుది ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు డిఆర్‌ఒ విజయసారధి సోమవారం తెలిపారు. జిల్లాలో మొత్తం 14,18,331 ఓటర్లు ఉన్నారన్నారు. పూర్తి జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలు, తహశీల్దార్, ఓటర్ నమోదు అధికారి కార్యాలయాల్లో పరిశీలన కోసం ఉంచామన్నారు. ఓటర్లు వారి పేర్లను జాబితాలో చూసుకోవచ్చని తెలియజేశారు.

జిల్లాలో ఆరు నియోజకవర్గాలలో మొత్తం ఓటర్లు 14,18,331 మంది ఉండగా, వీరిలో పురుషులు 7,01,135, స్త్రీలు 7,09,818 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే మడకశిరలో 2,11,779, హిందూపురం 2,05,477, పెనుకొండ 2,36,709, పుట్టపర్తి 2,12,137, ధర్మవరం 2,40,561, కదిరి 2,54,678 మంది ఓటర్లు ఉన్నారు.

అమ్మో..హెచ్‌ఎంపి వైరస



◆ బెంగళూరులో రెండు కేసులు

◆ ఆందోళన వద్దు.. జాగ్రత్తలు పాటించాలి : డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కోవిడ్‌ను పోలిన హెచ్‌ఎంపి వైరస్ వ్యాపిస్తోందన్న గుబులు అందరిలోనూ నెలకొంది. సోమవారం జిల్లా పక్కనున్న కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలో రెండు కేసులు నమోదయ్యాయి. ఇది అనంతపురం జిల్లాలో ఉలికిపాటుకు గురిచేసింది. ఎందుకంటే బెంగళూరు నగరం నుంచి జిల్లాకు నిరంతరంగా రాకపోకలుంటాయి. ఇతర దేశాల నుంచి వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ఇటువంటి తరుణంలో హెచ్‌ఎంపి వైరస్ వ్యాప్తి కూడా ఉంటుందేమోన్న గుబులు నెలకొంది. అది కూడా కోవిడ్ తరహాలోనే హెచ్‌ఎంపి కూడా వ్యాపిస్తుందని చెబుతుండటంతో అందరిలోనూ భయాలు నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు కోవిడ్ సమయంలో ఎదుర్కొన్న పరిస్థితులను తలచుకుని గుబులు చెందుతున్నారు.

ఆనాటి చేదు జ్ఞాపకాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి 2020 మార్చి 26వ తేదీన తొలి కోవిడ్ కేసు నమోదయింది. ఆ తరువాత క్రమంగా పెరుగుతూ వచ్చాయి. రెండేళ్లపాటు పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి. దీని నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో కొత్త వైరస్ మరోమారు ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో మధ్య వయస్కులే అధికంగా దీని భారినపడిన వారిలోనున్నారు. హెచ్‌ఎంపి వైరస్ చిన్నపిల్లలు, వయసు మీరిన వారిపై ఉంటుందని చెబుతున్నారు. ఇది మరింత ఆందోళన కలిగిస్తోంది. అప్పట్లో జబ్బు వ్యాప్తి కంటే లాక్‌డౌన్ భయాలు మరింత ఎక్కువగానున్నాయి. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకని ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. దీంతో పెద్దఎత్తున వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ ఆ గాయాల నుంచి కోలుకోలేకున్నారు. మళ్లీ అటువంటి పరిస్థితులొస్తే ఏమవుతుందోనన్న దిగులు నెలకొంది.

హెచ్‌ఎంపివి కేసులు లేవు

అనంత జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా॥ఈబి.దేవి

జిల్లాలో హెచ్‌ఎంపివి (హ్యూమన్ మెటా న్యూమో వైరస్)కు సంబంధించిన కేసులు లేవని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా॥ఈబి.దేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైరస్‌పై ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. న్యూమో విరిలే కుటుంబానికి చెందిన ఈ వైరస్ కరోనా వైరస్ తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని తెలిపారు. చిన్నపిల్లలు, వద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగటం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా వైరస్ వ్యాపిస్తుందని ఆమె వివరించారు. వైరస్ సోకిన తరువాత వ్యాధి లక్షణాలు 3 నుంచి 10 రోజుల్లోగా బయట పడతాయన్నారు. హెచ్‌ఎంపివి సోకిన వారికి సాధారణ జలుబు (ఫ్లూ) లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సబ్బు నీటితో తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, దగ్గినపుడు, తుమ్మినపుడు, నోటిని, ముక్కుని చేతిరుమాలుతో అడ్డు పెట్టుకోవాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలన్నారు. తగినంత పౌష్టికాహారం, మంచినీరు తీసుకోవాలన్నారు. వైరస్ తీవ్రతకు ఎక్కువగా గురయ్యే చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన చికిత్స అందిస్తారని తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయ సారధి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణతో కలిసి 215 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ వినతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినతుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటె చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌస్‌హోల్డ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కోర్టు కేసుల్లో, కోర్టు ఇచ్చిన కోర్టు ఆదేశాలను చదివి, చెల్లుబాటు అయ్యే కారణాలతో ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్.విజయకుమార్

హెచ్.బాబు

ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎపిఎస్‌టిఎ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నరేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని విఆర్.పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఎపిఎస్‌టిఎ జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్‌నాయక్ అధ్యక్షతన పెనుకొండ మండల కమిటీని ఎన్నుకున్నారు. నరేష్‌కుమార్ మాట్లా డుతూ భవిష్యనిధి, ఎపిజిఎల్ఐ లోన్లు, సరండర్ లీవ్ మొత్తాలను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పెనుకొండ మం డల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్.విజయకుమార్, ప్రధాన కార్య దర్శిగా హెచ్.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రాజేష్ నాయక్, జాయింట్ సెక్రటరీగా డి.వలీవుల్లా, కోశాధికారిగా ఎస్.షహబాజ్‌బాను, కార్యదర్శులుగా జిసి.వెంకటేష్, బి.వరప్రసాద్, ఎస్.రాధమ్మ, ఎ.హేమలత, కె.విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకట నాయక్, విశ్వనాథ్, ఎస్.సునీతమ్మ, ఎస్.సత్యవతి, జిల్లా కౌన్సిలర్స్‌గా కాడిశెట్టి శ్రీనివాసులు, సి.నరేష్‌కుమార్, ఎల్.విజయకుమార్ నాయక్, డి.శ్రీనివాసులు, కె.హరితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బత్తలపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలోని జ్యోతి హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఆద్విక గణిత శాస్త్ర. పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో అద్వికకు అభినందనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వం ఎడ్యుకేషన్ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో పలు పాఠశాల విద్యార్థులకు ఆబాకస్, వేదిక్ మాథ్స్ జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆద్విక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ దర్శతేజ మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో రాణించగలిగితే మిగిలిన అన్ని సబ్జెక్టులు సులభరీతిలో నేర్చుకోవచ్చునన్నారు. విద్యార్థులలో గణిత శాస్త్రంపై భయాన్ని పోగొట్టుటకు వేదిక్ మాథ్స్, అబాకస్ లాంటి పోటీలు బాగా ఉపకరిస్తాయన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆద్వికను ఉపాధ్యాయులు అభినందించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభను కనబర్చాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-గుడిబండ

సుజాతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని కెఎన్.పల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు సురేష్ వదిన, ఉపాధ్యాయురాలు సుజాతమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కొన్ని కారణాల వల్ల ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి అప్పుడు రాలేకపోయారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సోమవారం కెఎన్.పల్లి గ్రామంలో సురేష్ ఇంటికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుజాతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మీ కుటుంబానికి టి డిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర వక్కలిగ సంఘం సాధికార సమితి అధ్యక్షులు విఎ.పాండురంగప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, భీమరాజు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : తహశీల్దార్

విలేకరులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీధర్

ప్రజాశక్తి-పెనుకొండ

ఇంటి స్థలం, పట్టాలు ఇప్పిస్తామని మోసగిస్తున్న దళారులను నమ్మి మోసపోవద్దని తహశీల్దార్ శ్రీధర్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీల్లో సర్వే నెంబర్లు 264, 263, 262, 228లో ఇంటి స్థలం, పట్టాలు ఇప్పిస్తామని చెప్పుకుంటూ కొందరు దళారులు మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిని నమ్మవద్దని ఎవరికీ పట్టాలు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయమని ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే ఆ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బైక్ ఢీకొని విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-లేపాక్షి

ద్విచక్ర వాహనం ఢీకొనడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలం లోని చోళసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చోళసముద్రం గ్రామం లోని శ్రీచౌడేశ్వరీదేవి ఆలయ అర్చకులు చంద్ర కుమారుడు లోకేష్ అదే గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల వదలడంతో నడుచుకుంటూ ఇంటికి బయల్దేరాడు. అదే సమయంలో బిసలమానేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై హిందూపురం వైపు నుంచి వస్తూ లోకేష్‌ను ఢీకొన్నాడు. దీంతో లోకేష్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటా హుటిన హైవే అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొనడంతో గాయపడిన లోకేష్

కిశోరి బాలిక వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం సిడిపిఒ రాజేశ్వరి, ఈఓఆర్‌డి లక్ష్మీనరసమ్మ, ఆధ్వ ర్యంలో కిశోరి బాలిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎసిడిపిఒ గీతాబాయి, సూపర్వైజర్ సుభారాణి, వెలుగు ఎపిఎం మదన్, పిహెచ్‌సి సూపర్వైజర్ రవీంద్ర, ఎఎస్‌ఐ మురళి హాజరై పలు విషయాలు వెల్లడించారు. 11-18 ఏళ్ల బాలికల్లో విద్య, ఆరోగ్య, ఆర్థిక స్వావలంబన, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, ఆత్మ రక్షణ కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. కిశోర బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. అడ్డంకులను అధిగమించే శక్తిసామర్థ్యాలను పెంపొందింపజేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్ట డానికి ప్రతి గ్రామంలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా కిశోర బాలిక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా పోలీసులు, విద్య, వైద్య, వెలుగు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక పాత హైస్కూల్ ఆవరణలో మంగళవారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో అనంతపురంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బిగ్ టీవీ పాత్రికేయులు బాబా తెలిపారు. బాబా మాట్లాడుతూ ఆ శిబిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ దాదాపు అన్ని రకాల వ్యాధులకు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు, చికిత్స చేస్తారని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని బీజీ హళ్లి గ్రామానికి చెందిన తెలుగు యువత తాలూకా అధ్యక్షుడు బాలకృష్ణ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షేక్షావలికి కొత్త ప్రింటర్ విరాళంగా అందజేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతుండడంతో ప్రింటర్ అందజేశామన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో ప్రింటర్ అందజేస్తున్న బాలకృష్ణ

పోరాటాల ఫలితమే కళాశాలల్లో 'మధ్యాహ్నభోజనం'

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధర్యంలో చేసిన పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి అన్నారు. బాలికల జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ హిందూపురం పట్టణ నాయకులు ఆఫ్రిద్, భగత్, ఇంతియాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి నందీష్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల 4వ తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, కళాశాల ఆవరణలోనే భోజనాన్ని వండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ రాజీ లేని పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు నరేంద్ర, అనిల్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి ఇస్తున్న బేడ, బుడగ జంగాల నాయకులు

బుడగ జంగాల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని బుడగ, బేడ జంగం సామాజిక వర్గం ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని ఆ సంఘం నాయకులు తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బుడగ జంగం, బేడ జంగం కులం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎస్సీ వర్గీకరణపై సచివాలయాల్లో ఉంచిన ఎస్సీల పేర్లలో మా కులస్థుల పేర్లు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. బుడగ జంగం, బేడ జంగం కులాలను ఆన్‌లైన్‌లో చేర్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మారేష్, ఈశ్వరప్ప, గంగాధర్, ఆంజనేయులు, రంగనాథ్, బాబు, వేణు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని అమిదాలగొంది జడ్పీ హైస్కూల్‌లో సోమవారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో హెచ్‌ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు పై చర్చించారు. అనంతరం విద్యా బోధన, ప్రోగ్రెస్‌పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎంసి ఛైర్మన్ రంగస్వామి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమావేశం లో ఉపాధ్యాయులు అశ్వత్, నంజుండ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న టిడిపి నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న 16 మంది బాధితులకు మెరుగైన చికిత్సల కోసం రూ. 19 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, నాయకులు అశ్వర్థ నారాయణరెడ్డి, అమర్నాథ్, మాజీ సర్పంచి హెచ్.ఎన్. రాము, పూలకుంట సర్పంచి మంజునాథ్, మీడియా కో ఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్, దుర్గ నవీన్, భాస్కర్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో 'రేకులకుంట'కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-మడకశిర

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈ నెల 3వ తేదీ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయులకు సైన్స్‌ఫేర్ నిర్వహించారు. అందులో మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయభార్గవి ప్రదర్శించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి దక్కింది. ఆమెకు తెలంగాణ హైకోర్టు జడ్జి రూ. 5వేల నగదు, ప్రశంసా పత్రం ఇచ్చి సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఉపాధ్యాయురాలు విజయభార్గవిని రేకులకుంట హైస్కూల్ హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉపాధ్యాయురాలు విజయభార్గవిని సత్కరిస్తున్న తెలంగాణ హైకోర్టు జడ్జి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

స్వచ్ఛభారత్ క్లాప్ మిత్ర కార్మికులు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీకి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కుల్లాయప్ప మాట్లాడుతూ మండల గ్రామ పంచాయతీ లోని పనిచేస్తున్న స్వచ్ఛభారత్ క్లాఫ్ మిత్ర కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంజినప్ప, లక్ష్మీదేవి, నిర్మల, శ్రావణి, నాగమ్మ, సాలెమ్మ, భాగ్యమ్మ, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలో కందిపంటలో పంటకోత ప్రయోగాలను అధికారులు సోమవార నిర్వహించారు.. గ్రామంలోని రైతులు అక్కమ్మ, గంగన్నకు చెందిన కంది పొలాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఓబిరెడ్డి, విహెచ్ఎ హరిప్రియ, బీమా కంపెనీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎర్రిస్వామి, ఏఎసీ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లపట్టాలివ్వాలి

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలో అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ దాసు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ముసుగు మధు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాల్లోకి రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు

నవోదయ కోచింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల విద్యార్థులు సౌలభ్యం కోసం ధర్మవరంలో నవోదయ, మరియు గురుకుల కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు శ్రీనివాసరాజు తెలిపారు, పట్టణ విద్యార్థులే కాకుండా గ్రామీణ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈ విద్యా సంవత్సరానికి వారికి అవసరమైన విధానంలో బోధన ఉంటుందని తెలిపారు.తల్లి తండ్రులు తమ పిల్లలను తమ కోచింగ్ సెంటర్‌లో చేర్చాలని నిర్వాహకులు కోరారు.

'లయోలా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి విశ్వం ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ వేది మ్యాథ్స్ లో పట్టణానికి చెందిన లయోలా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పాఠశాలకు చెందిన పి. మధుసూదన్ ప్రథమ బహుమతి, ఏం. భవాని ద్వితీయ బహుమతిని సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శంకర్ నాయుడు తెలిపారు. అదేవిధంగా అబాకస్ పోటీల్లో కూడా తమ పాఠశాలకు చెందిన రితికా రెడ్డి ప్రతిభ కనపర్చినట్లు చెప్పారు. ప్రతిభా విద్యార్థులను కరెస్పాండెంట్ శంకర నాయుడుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థినులు

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) PENUKONDA

E.P.9/2023, O.S.92/2013

Between:
K.Sathya Narayana Reddy ...Petitioner/DHr.
And
Baisani Hari Gopal ...Respondent/J.Dr

Notice to Respondent J.Dr. Under Order 21 Rule 64 C.P.C.

To.
Baisani Hari Gopal, S/o.Baisani Govindaiah, Major, Business, 2nd Ward, Gorantla Town and Mandal.

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా K.సత్యనారాయణ రెడ్డి, S/o.లక్ష్మిరెడ్డి, నారసింపల్లి H/o.బూదిలి గొరంట్ల మండలం, అనువారు నీ మీద వేశిన వ్యాజ్యము E.P.9/2023, O.S.92/2013 పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో **20-1-2025**వ వాయిదా వున్నది. నీవు పై తేదీన పైకోర్టు యెదుట ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని హాజరు అయ్యి పై వాజ్యము షెడ్యూలులో చూపిన ఆస్తిని ఎందుకు వేలము వేయకూడదో సమాధానము చెప్పవలయును. అట్లు పై తేదీన హాజరు కాని యెడల పై వ్యాజ్యము నీ పరోక్షమున తీర్మా నించబడునని తెలియచేయడమైనది.

॥ కోర్టు ఉత్తర్వు మేరకు ॥

జి.మల్లిరెడ్డి
ఆర్జీదారు పరం వకీలు,
పెనుకొండ.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

జ్ఞాపికలతో విద్యార్థినులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తమిళనాడులో ప్రసిద్ధిగాంచిన అరుణాచలేశ్వర ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మవరానికి చెందిన బాపు బాలాజీ శిష్య వృందం ఈ ప్రదర్శనలో పాల్గొంది. గోరంట్ల, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురానికి చెందిన 42 మంది విద్యార్థులు దేవాలయ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ముఖ్యంగా గోరంట్ల ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు మైలారం వేద ప్రజ్ఞ, జయప్రణీత, కొత్త చెరువు శ్రీ చైతన్య విద్యార్థులు గుర్రంపాటి హెమీషా, రీతిమ ధర్మవరానికి చెందిన ఉదయశ్రీ మోక్షితతో పాటు పలువురు విద్యార్థులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపు బాలాజీ కుమార్తెలు హర్షశ్రీ ,రామలాలిత్యాలు చేసిన నృత్యం సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రంగస్థల సకల వృత్తి కళాకారుల సేవా సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ గురువులైన బాపు బాలాజీ, సతీమణినిసత్కరించారు. నత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ఆలయ నిర్వహకుల చేతుల మీదుగా శివుని ప్రతిమ గల ఆదిత్య అవార్డులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణాచల ఆలయ సిబ్బంది, అరుణాచలేశ్వర దర్శనానికి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్తే కిశోరి వికాసం లక్ష్యం

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

బాలికలలో ఉన్నత విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కదిరి సిడిపిఒ రాధిక, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయసులోపు విద్య, ఆరోగ్యం, భద్రత, స్వాలంబన మెరుగుపరచడం కిశోర వికాసం లక్ష్యమని తెలిపారు. బాల్య వివాహాలు తగ్గించి వారిని చదువు దిశగా నడిపించడానికి ప్రతి గ్రామం లో మహిళా పోలీస్ కన్వీనర్‌గా కిశోర బాలికల కమిటీని ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య సాయి, ఎంఇఒ గోపాల్ నాయక్, ఈవోఆర్డీ అశోక్ కుమార్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయుడు జగదీష్, మహిళా పోలీసు విజయలక్ష్మి, ఏపీఎం రవీంద్రారెడ్డి,మండల స్థాయి శిక్షకులు, సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోర వికాసం ఓ మంచి అవకాశమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ బత్తలపల్లి ప్రాజెక్టు పరిధిలో కిశోర్ వికాసం శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో సరస్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో నరసింహనాయుడు. ఈవోఆర్డీ క్రిష్టప్ప, శ్రీనివాసులు, చాముండేశ్వరి. సుధాకర్ నాయక్, ఏపీఎం సుదర్శన్ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర వికాసం అనే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్నిగ్రామంలోని అందరికీ తెలియజేసి, ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. కిశోర వికాసం కమిటీల ద్వారా పూర్తి అవగాహన తెస్తే మంచి ఫలితాలను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు,ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఎస్‌బిఐ సేవలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రిటైర్డ్ ఉద్యోగులకు ఎస్‌బిఐ ఆధ్వర్యంలో విశేషసేవలు అందిస్తోందని ఆబ్యాంకు జిల్లా రీజినల్ మేనేజర్ శశిధర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయను పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు విశ్రాంత ఉద్యోగుల నూతన సంవత్సరపు డైరీని విడుదల చేశారు. అనంతరం రీజినల్ మేనేజర్ శశిధర్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగస్తులు అందరూ కూడా తమ పెన్షన్ పదిలంగా ఉంచుకోవడానికి, వివిధ సేవలను ఎస్‌బిఐ అందిస్తోందని తెలిపారు. అంతేకాకుండా నిబంధనల ప్రకారం రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతఉద్యోగుల సంఘం అధ్యక్షులు చలపతి, కార్యదర్శి నర్సిరెడ్డి, గౌరవ అధ్యక్షులు రామయ్య, కోశాధికారి సుధాకర్, టౌన్ బ్రాంచ్ మేనేజర్ ఉమామహేశ్వర వర్ధన్, బ్యాంకు సిబ్బంది, పెన్షన్ దారులు పాల్గొన్నారు.

కదిరి మండల సర్వేయర్‌పై వేటు

ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న ప్రభంజన్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్వర్వులు స్థానిక అధికారులకు అందాయి. సర్వేయర్ అక్రమాలకు పాల్పడుతుండటం రైతులను తరచూ కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం తదితర వాటిపై ప్రజాశక్తి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై కదిలిన జిల్లా యంత్రాంగం సర్వేయర్ అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. విచారణ నివేదిక పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు మండల సర్వేయర్ పై సస్పెన్షన్ వేటు వేశారు.

వికలాంగుల పింఛన్ల పున: పరిశీలన

ప్రజాశక్తి -పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో అనారోగ్య పింఛన్ల పున: పరిశీలన కార్యక్రమంలో పుట్టపర్తి డివిజన్‌లో సోమవారం ప్రారంభమైనట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 1715 మంది దీర్ఘకాలిక రోగాల పింఛన్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని మొదటగా పుట్టపర్తి రెవిన్యూ డివిజన్ లో సర్వే జరుగుతోందని అన్నారు. ఈ డివిజన్లోని ఏడు మండలాల్లోని 439 మంది పింఛనుదారులను క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ బృందం వారంలో మూడు రోజులు సోమ, మంగళ, బుధవారాల్లో రోజుకు 20 నుంచి 25 మంది పింఛనుదారులను పరిశీలిస్తుందన్నారు. పుట్టపర్తి డివిజన్ పూర్తి అయిన తరువాత ధర్మవరం, కదిరి, పెనుకొండ డివిజన్లలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 22 వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

కొత్తచెరువు : ప్రభుత్వ ఆదేశాల మేరకు 15వేల రూపాయల పింఛను తీసుకుంటున్న వికలాంగుల వివరాలను మొదటి విడతలో పరిశీలన చేస్తున్నట్లు డిఆర్‌డిఎ ఎపిడి నారాయణ, డాక్టర్ సునీల్ తెలిపారు. పింఛన్ల వెరిఫికేషన్ టీమ్ మెంబర్లు హర్షద్ అహమ్మద్, ఇర్షద్ సలీంతో కలసి కొత్త చెరువులోనే సచివాలయం ఒకటి, రెండు, మూడు పరిధిలోని పింఛన్లను సోమవారం పరిశీలించినట్లు చెప్పారు. ఈ పరిధిలో 22 పింఛన్లు ఉండగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి వెరిఫికేషన్ నిర్వహించి రిపోర్టును ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. ఫిబ్రవరి మూడవ తేదీ వరకు ఈ వెరిఫికేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 109 పింఛన్లుఉన్నాయని7, 8, 20, 21వ తేదీలలోవారి ఇళ్ల వద్దకే వెళ్లి వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు.

సర్వేలో పాల్గొన్న అధికారులు

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

కుష్టు నిర్మూలనకు సమిష్టి కృషి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కుష్టి వ్యాధి నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ టిఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టి వ్యాధి నివారణ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు, చర్మంపై బూడిద పేలు తదితర లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ లక్షణాలు గల వ్యక్తులు రెండు నుంచి ఆరు నెలలపాటు తగిన మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ కుమార్, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, డాక్టర్ జి. తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందుతోందన్లి అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ వి రత్న ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తూ వెంటనే సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎఎస్పీతో పాటు లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి , ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్పీకి సమస్యను విన్నవిస్తున్న బాధితురాలు

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కొత్తచెరువు

చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలని .తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజు, సిఐ ఇందిర తెలిపారు. బాల్య వివాహాలు, గృహహింసపై సచివాలయ మహిళా పోలీసులకు ,అంగన్వాడీ కార్యకర్తలకు కొత్త చెరువులోనే ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపల యువతి 21 సంవత్సరాల లోపల వయస్సున్న యువకులకు బాల్యవివాహాలు నిర్వహించడం నేరమని, అలాంటి వాటికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, విద్యార్థులకు కూడా వీటి పైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చలపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా కానిస్టేబుల్, పాల్గొన్నారు.

నంబులపూలకుంట :బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని అధికారులు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిడిపిఒ రాధ, ఎంపీడీవో అంజనప్ప, ఎంఇఒ గోపాల్ నాయక్, మాధవరెడ్డి, సిహెచ్ఒ నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బాలికలపై వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమంలో గీత ప్రియ, శ్రీలత, వేమన లక్ష్మి, దేవి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని గూనిపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణాపురం గ్రామానికి చెందిన రమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుక్కపట్నం నుంచి తన స్వగ్రామం కి ద్విచక్రవాహనంలో వెళుతున్న రమణ గూనిపల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందికి పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ కృష్ణమూర్తి ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న గుత్తేదారు నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

కర్నాటక నుంచి రెండు వాహనాలలో తీసుకువస్తున్న మద్యాన్ని మండలంలోని మహమ్మదాబాద్‌క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు . వీటితోపాటు ఒక సుమో, ఒక కారు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాస్తవాలు వెలికితీయడమే ప్రజాశక్తి విధానమని నిత్యం ప్రజల పక్షాన నిలబడడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుందని తహశీల్దార్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ ప్రసాద్, వీఆర్వోలు జనార్దన్, నాగరాజు, ఓబులేసు, సుధాకర్, ఇనాయతుల్లా, ఉదయ్, కార్యాలయ ఉద్యోగులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు

అబాకస్‌లో ఉషోదయ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

విశ్వం ఎడిటెక్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలోని స్థానిక ఆదిత్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయిలో పోటీల్లో హిందూపురం మండలం పెద్ద గుడ్డంపల్లికి చెందిన ఉషోదయ పాఠశాల, పట్టణంలోని బాలాజీ ఉషోదయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలలో కరస్పాండెంట్ కే.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల విద్యార్థులు చరణ్, మైత్రి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, కిరణ్మయిరెడ్డి , ఏజిఎం రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శివరాం, పరిపాలన అధికారులు లక్ష్మీ, అరుణకుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఇఒ

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

గతంలో హిందూపురం ప్రాంతంలో అంగన్వాడీ సెంటర్లకు పాలు సరఫరా చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడిన వ్యక్తికే మళ్లీ టెండర్లు కట్టబెట్టారని ఆ టెండర్‌ను రద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తిలో ఆయన మాట్లాడుతూ గతంలో టెండర్ దక్కించుకున్న వ్యక్తి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఈ ఘటనకు సంబంధించి సిడిపిఒ సస్పెండ్ అయిందని చెప్పారు. తిరిగి అదే వ్యక్తికి టెండర్లు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందన్నారు.

స్కేటింగ్‌లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

స్కేటింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్, యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు శిక్షకులు హేమంత్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న హిందూపురం పట్టణంలోని టీచర్స్ కాలనీలో స్కేటింగ్ శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు, ట్రోఫీ కైవసం చేసుకున్నారన్నారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన పీ.ఎం.వర్ణిక ప్రథమ స్థానంలో నిలువగా పీ.ఎం.జస్విక్, ఎం.జి.దక్షేష్ ప్రతిభ కనబరచారన్నారు. ద్వితీయ స్థానంలో పి.పర్ణిక, ఎస్. పర్వేస్ నిలిచినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన విద్యార్థులు తొలిసారిగా స్కేటింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల స్థానిక క్రీడాభిమానులు వారిని అభినందించారు.

ప్రతిభావిద్యార్థులకు అభినందన

'రహదారి వెంట నడవాలంటే తడవాల్సిందే'..!

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని మంజునాథ కాలనీ, కోటర్స్, హాస్టల్ కు వెళ్లాలంటే నీటిలో తడిసి వెళ్లాల్సిందే. ప్రధాన రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లాల్సిన రహదారి నిత్యం నీటితో నిండిపోయి కాలువలను తలపిస్తోంది. ఈ రహదారిపై నడవాలంటే తడిసి వెళ్లి నడవాల్సిన పరిస్థితి రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడు తున్నారు. ఈ రహదారిలో ఇప్పటికే పలువురు కిందికి పడి ఆస్పత్రులు పాలైనప్పటికీ అధికారుల్లో చలనం కలగకపోవడం విడ్డూరమని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారిపై నీటి ప్రవాహం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువను తలపిస్తున్న రోడ్డు

ఎన్నికల బిల్లు చెల్లించాలని ఆర్డీవోకు వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

సార్వత్రిక ఎన్నికల్లో భోజనం, ఇతర సదుపాయాలు సమకూర్చడం కోసం ఖర్చు చేసిన బిల్లుల బకాయిలను చెల్లించాలని కోరుతూ గుత్తేదారుడు జబీవుల్లా సోమవారం ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. జబీవుల్లా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిబ్బందికి భోజనాలు, బారికేడ్స్, షామియానా, రవాణాకు సంబంధించి నేటికీ రూ. 10.75 లక్షలు బిల్లులు అందలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో టి.నంద్ కుమార్ నియోజకవర్గ ఓటరు తుది జాబితా-2025ను విడుదల చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,511 మంది ఉండగా అందులో పురుష ఓటర్లు 1,18,162, మహిళా ఓటర్లు 1,18,345, థర్డ్ జెండర్ ఓటర్లు 4 ఉన్నారు.